కలుషిత నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలి



సమస్య తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: తాగునీటిలో కలుషిత నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సూచించారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ గడ్డ వద్ద మంజీర వాటర్ డ్రైనేజీ నీటితో కలిసి అపరిశుభ్రంగా సరఫరా అవుతుండటం, తాగునీటిలో కలుషిత నీరు చేరటంతో వాటర్‌వర్క్స్ సిబ్బందితో కలిసి బుధవారం లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ ప్రియాంక, డ్రైనేజీ సూపర్‌వైజర్ నరేంద్ర, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అతిరుద్ర యాగం



ఆల్విన్‌కాలనీ: మాస శివరాత్రి సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లోని కాశి విశ్వేశ్వర దేవాలయంలో బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకిటి రామకృష్ణ ఆధ్వర్యంలో అతిరుద్ర యాగం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సతీష్ రావు, వాకిటి ముంజుల, సుమలత, రమేష్, కిరణ్‌శర్మ, పావని, శివ, రాజు, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. కాలనీకి చెందిన దివ్యాంగురాలికి అండగా నిలిచారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ చేతుల మీదుగా బుధవారం రోడ్డు నంబర్ 10లో నివాసం ఉండే పి. సన్యాసిరావు కుమార్తె కృష్ణవేణికి వీల్ చైర్ అందించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శివ చౌదరి, రమణ, జమీల్, సాజిద్, రవీందర్, ఆది నారాయణ, సతీష్ రెడ్డి, బొంత రవి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పాలనాపరమైన మార్పులు

బాలానగర్: జేఎన్‌టీయూలో పాలనాపరమైన మార్పులు జరిగాయి. డైరెక్టర్ ఆఫ్ అటానమస్ కాలేజెస్ అఫైర్స్ రవీంద్రారెడ్డిని మ్యాథ్స్ విభాగానికి ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. ఇంతకు ముందు అకాడమిక్ ఆడిట్ సెల్ నుంచి విడదీసి కొత్తగా ఏర్పాటు చేశారు. డైరెక్టర్ ఆఫ్ అటానమస్ కాలేజెస్ అఫైర్స్ విభాగం ఇప్పుడు అకాడమిక్ ఆడిట్ సెల్‌లో ఏకీకృతం కానుంది.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- దిల్‌ఖుష్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి బుధవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్‌ఖుష్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీవాసుల కోరిక మేరకు ఇక్కడున్న పిల్లలకు ఇబ్బంది కలగకుండా ఈ ప్రాంతంలో స్కూల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు వారికున్న ఆసక్తిని గమనించి అయా పాఠ్యాంశాలలో నైపుణ్యం పెంచే విధంగా ప్రోత్సహించాలని చదువు, క్రీడలు, సాంస్కృతికం అన్ని రంగాల్లో కూడా విద్యార్థులు ముందుండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరీష్ చంద్ర ప్రధానోపాధ్యాయురాలు ఎస్. అరుణ జ్యోతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ అనుమతుల కోసం చర్యలు తీసుకోవాలి



జోనల్ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని వసంత్ నగర్, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, భగత్‌సింగ్ నగర్, ఫేజ్ 1, 2 సర్దార్ పటేల్ నగర్, సీబీసీఐడీ కాలనీ తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతులు కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణదారులకు ఎల్ఆర్ఎస్, ఇతర అన్ని అనుమతులు ఉన్నా ప్రభుత్వం నిర్మాణాలకు అనుమతి ఇవ్వకపోవడం ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించామని, త్వరలో ఈ సమస్యను పరిష్కరించి అనుమతులకు మార్గం సుగమం అయ్యేటట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలానగర్‌కు చెందిన బోజ్జి నీలమ్మకు రూ.1.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును లబ్ధిదారురాలి భర్త బోజ్జి లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు. పేదలకు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాలా అభివృద్ధి పనులు ప్రారంభించాలి

కార్పొరేటర్ సబిహా బేగం



జోనల్ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అకాల వర్షాలు కురిసిప్పుడల్లా సర్దార్ నగర్ నాలాకు ఇరువైపులా నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాలా అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని కార్పొరేటర్ సబిహాబేగం కోరారు. ఈ మేరకు బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాల నుంచి అకాల వర్షాలతో నాలాల నుంచి ఇళ్లల్లోకి వర్షం నీరు చేరుతుందన్నారు. దీంతో నిద్రలేని రాత్రుళ్లు గడపాల్సి వస్తుందని వివరించారు. ఈ సంవత్సరమైనా నాలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కూకట్‌పల్లి: వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందేశ్వర్, కార్యదర్శి సుబ్బు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కేజీబీవీలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రానున్న కాలంలో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాసు, రఘు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం



హన్సీ

మూసాపేట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు తిరిగిరాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కామారెడ్డి, అడవి లింగాల తండాకు చెందిన కేశావత్ కిషన్, హన్సీలు భార్యాభర్తలు. వీరు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15న రాత్రి 3 గంటలకు భర్త నిద్ర లేచాడు. భార్య హన్సీ (38) ఇంట్లో కనిపించలేదు. చుట్టు పక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో....



నరేంద్ర కుమార్

కూకట్‌పల్లి జయ నగర్‌లోని అపార్టుమెంట్‌లో నరేంద్ర కుమార్ (44) భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. డిసెంబర్ 2023న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. తన భార్యా పిల్లలు కూడా కొన్ని నెలలు ఎదురు చూసినప్పటికీ రాకపోవటంతో పుట్టింటికి వెళ్లిపోయారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో, బంధువులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించకపోవటంతో ఇన్ని రోజులు వస్తాడని ఎదురు చూశారు. నరేంద్ర కమార్ తల్లి ఆశాలత కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

గతంలో వేధింపులు భరించలేక నగరానికి వలస వచ్చిన కుటుంబం

జీడిమెట్ల: బాలికను వేధిస్తున్న యువకుడికి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం మోదుగులగూడానికి చెందిన ఓ కుటుంబం నగరానికి వలస వచ్చి గాజులరామారంలో నివసిస్తున్నారు. గతంలో గ్రామంలో ఉండగా బాలిక(19)ను వినయ్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. బాలిక తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. బాలిక జోలికి వెళ్లవద్దని పెద్దలు పేపర్‌పై రాయించి తీర్మానం చేశారు. యువకుడి వేధింపులు భరించలేక ఆ కుటుంబ సభ్యులు నగరానికి వలస వచ్చారు. మూడు నెలల క్రితం వినయ్ ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టడంతో తల్లిదండ్రులు సిరోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడిని పిలిపించి ఫొటోలు ఫోన్ నుంచి డిలీట్ చేయించారు.
కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. బాలిక గాజులరామారంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్న విషయం తెలుసుకున్న వినయ్ బుధవారం మధ్యాహ్నం సూపర్ మార్కెట్‌కు వచ్చాడు. కత్తి కొనుగోలు చేసి ఆమె కోసం వేచి చూస్తున్నాడు. గమనించిన బాలిక భయంతో సూపర్ మార్కెట్ లోపలికి వెళ్లి దాక్కుంది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కొంత మందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. వినయ్‌ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



రక్షణ కిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అందజేసిన రక్షణ కిట్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో పాటు కార్మికులు వారి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించిన సేఫ్టీ కిట్లను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా చెత్త, వ్యర్థాలు రోడ్లపై, ఎక్కడపడితే అక్కడ వేయకుండా కార్మికులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, ఎస్ఎఫ్ఏ వెంకట్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన అంబుర్ లక్ష్మమ్మ కల్తీ కల్లు తాగడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గోపాల్, కాసాని శంకర్, లింగం, శివ, లక్ష్మమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పలహారం బండి ఊరేగింపు



కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ గాంధీ



తొట్టెల ఊరేగింపులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ తదితరులు



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర నగర్ కాలనీలో బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ గాంధీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

కూకట్‌పల్లి: ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మేకల రమేష్, రమణ, సుదర్శన్, శివ చౌదరి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో వాయుపుత్ర యూత్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు, నాయకులు రాములు గౌడ్, సాయిగౌడ్, మాధవరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మతల్లి తొట్టెల ఊరేగింపు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో నల్ల పోచమ్మతల్లి తొట్టెల ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దీపక్ కుమార్, రాజేష్, సాయితేజ, మల్లికార్జున రెడ్డి, సూర్య, శ్రీధర్, వెంకటసాయి, పుష్కల్, శరత్, యశ్వంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు జరిగేనా ?

ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు 1.47లక్షలు

- సొంత స్థలాలు లేకపోవటంతో ఉన్న వారికే 1800 ఇళ్లు
- నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 మంజూరు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇన్ని రోజులుగా ఆలస్యంగా చేపట్టిన పనుల్లో వేగం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1.47 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ కమిటీలు, మండలాధికారుల పరిశీలన అనంతరం అధికార యంత్రాంగం ప్రతిపాదనలను నివేదించగా, జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 1800 మంది అర్హులను తేల్చారు.

◆ జిల్లాలో మొత్తం 1553 ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 18 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 711 ఇళ్లు గ్రౌండింగ్ దశలోనే ఉన్నాయి. మిగతా ఇళ్లు వివిధ దశల నిర్మాణాల్లో కొనసాగుతున్నాయి. పూర్తయిన ఇళ్లకు ఆర్థికసాయం పూర్తిస్థాయిలో అందగా.. వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతీ సోమవారం ఆర్థికసాయాన్ని అందజేస్తున్నారు.

పనులు వేగవంతం..

ఆషాఢమాసంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు కొందరు వెనకాడుతున్నారు. అయితే మంజూరైన ఆర్థికసాయం వెనకకు వెళ్తుందేమోనని అపోహతో మరి కొందరు పనులను ప్రారంభించారు. అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. కలెక్టర్, గృహ నిర్మాణశాఖ పీడీ కలిసి సంబంధిత ప్రాంతాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. వార్డు, కార్యదర్శి, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

స్థలం లేకున్నా.. దరఖాస్తు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వలస కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడే అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న వలస కుటుంబాలతో పాటు జిల్లాలోని 16 పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపల్ సర్కిళ్లలోని బస్తీవాసులు, గ్రామిక ప్రాంతాల్లో జీవనాన్ని సాగిస్తున్న నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 1.47లక్షల దరఖాస్తులు అందాయి.

మంజూరులో అధికారులు సతమతం..

చాలా మంది దరఖాస్తుదారులకు నివాస స్థలాలు లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం అధికార యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారింది. పురపాలక సంఘాలు, మున్సిపల్ సర్కిళ్ల పరిధిలో స్లమ్ ఏరియాలను గుర్తించడంతో పాటు ఇందులో అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు.

5 అసెంబ్లీ నియోజకవర్గాలు

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 ఇళ్లు మంజూరు కానుండటంతో ప్రస్తుతం మంజూరు చేసిన 1800 ఇళ్లు మినహాయించి మిగతా వాటిని గుర్తించిన బస్తీల్లోని అర్హులకు కేటాయించి, రీ –డెవలప్‌మెంట్ పథకం కింద వారికి అక్కడే (పాత నివాసం స్థానంలో) ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు అధికారయంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మాణాలు

ఇప్పటివరకు 1,553 పైబడి మంజూరు పత్రాలను అందించినట్లు గృహ నిర్మాణశాఖ పేర్కొంటోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇంటిని నిర్మాణం చేయాలన్న నిబంధనను సడలిస్తూ.. కొన్నింటినీ సరళతరం చేశారు. అయితే 400 నుంచి 600 లోపు చదరపు అడుగుల ఫీట్లు (45–65 గజాలు) స్థలంలోనే ఇంటిని నిర్మించాల్సి ఉంటుంది. అన్ని సౌకర్యాలతో అనుకూలంగా ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని దశలవారీగా అందిస్తారు.

కలుపు మొక్కలు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

బాలానగర్: జేఎన్‌టీయూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో కలుపు మొక్కలు తొలగించాలని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు రాహుల్‌నాయక్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో అనేక ప్రాంతాల్లో గడ్డి పేరుకుపోయి పాములు హాస్టల్ పరిసరాల్లోకి రావటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు దోమల మందు కూడా పిచికారీ చేయలేదన్నారు. డ్రైనేజీలు పొంగి 200 మీటర్ల మేర నీరు పారుతున్నదని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సాయికుమార్, సృజన్, సాగర్, తనుజ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.